

# మొగవాళ్ళు త్యాగాలయితే—

శ్రీ గాలి బాలసుందరరావు

* * *

భావవీధి కార్యస్థానంలో గంట ఠాంగ్ ఠాంగ్ మని నాలుగు కొట్టింది. పత్రిక సహాయ సంపాదకుడు పద్మనాభశర్మ బయటకు పోవటానికి ఉద్యుక్తుడైనాడు. అంతలో టెలిఫోన్ గంట రింగ్ రింగ్ మంది. రిసీవర్ చెవిదగ్గిర పెట్టుకుని "హల్లో!" అన్నాడు, పద్మనాభశర్మ. ఆ తీగల మీద నర్తనం చేస్తూవచ్చే శబ్దం, ఒక యువతీమణి కోమల కంఠస్వరం. "నేను ఒక అరగంటలో మీ దగ్గరకు వస్తున్నాను. దయవుంచి వెళ్ళిపోకండి" అన్నది ఆ అపరిచిత కంఠం.

ఆ సమయంలో మరెవరైనా ఉండి వుంటే ఒక, పై పై క్షమార్పణ చెప్పి అతను వెళ్ళిపోయేవాడే. కాని, ఆ కంఠంలో కోమలత్వం. ఆ కంఠస్వామిని తెగ అతని కాళ్ళకు బంధాలు వేసినయి.

భావవీధి సంపన్నుడి కూతురు. చందాదారుల సహాయంతోనూ, వ్యాసకర్తల అనుగ్రహంతోను, పాఠకుల అభిప్రాయాలతోను, నిమిత్తం లేదు, భావవీధికి. పత్రికాధిపతులిచ్చే ప్రతిఫలానికి ఆశపడి, సంపాదకుడికి సాష్టాంగంచేసి వ్యాసాలిచ్చే రచయితలు వేలకువేలున్నారు, భావవీధికి. అల్లాంటి పత్రికకు పద్మనాభశర్మ సహాయ సంపాదకుడు. పేరుకు సహాయ సంపాదకుడైనా ఆ పత్రికా సామ్రాజ్యానికి అతడే నియంత. ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప, నియంతకు సహజమైన నిర్లక్ష్యం అతను సాధారణంగా ప్రదర్శించుతూనే ఉండేవాడు.

వ్యక్తి స్థూలసూక్ష్మశరీరాల్లాగే నేటి ప్రధాన పత్రికలకు, సంపాదక సహాయ సంపాదకు లుంటారు. పద్మనాభశర్మ భావవీధిని నేటి భావవీధిగా చేశాడు. తెలుగు పత్రికల సంపాదకులలో నెలకు నూటయాభై రూపాయలు తెచ్చుకుం డేవాడతనొక్కడే.

మాటలు మానవ స్వభావానికి ప్రతిరూపాలయితే, అతను ఆదర్శాల ముద్ద; ధర్మాల తట్ట; పోతబోసిన నీతి. కాని, ఆ గాంధీటోపీ క్రింది మెదడు, అనేక అమాయికల జీవితాల్ని భగ్నం చేసిన ఆలోచనలు చేసింది; చేస్తోంది. ఆ సమున్నతమైన దేహం, ఆ అందమైన ముఖం, ఆ సమ్మోహన శక్తివంతములైన కళ్లు,

ఆ అమృతంవర్షించే వాక్కు, ఎంత మంది తరుణుల్నో దాసీలను చేసు కుంది. జాతీయ భారతంలో గౌరవ చిహ్నాములయిన ఆ ఖద్దరు బట్టలు. ఎంత కల్మషాన్నో కప్పి పుచ్చుతు న్నాయి. బాహిరమును బట్టి బహు విశాలమని అందరూ అనుకుండే ఆహృదయం ఎంత కాఠిన్యతతోనో గర్భితమై ఉంది.




అతని సహజ సౌందర్యాకర్షణల దుర్వినియోగంతో, గుండెలు నలిగిన వారికిగాని, ఆ అమృతమూర్తిలో విషచ్ఛాయలు కనబడవు. అన్నింటికీ అంగరక్ష, అతని అవివాహిత స్థితి.

కాస్సేపటిలో ఒక పద్ధెనిమిదేళ్ళ పిల్ల ఆఫీసులో అడుగు పెట్టింది. సిల్కుగుడ్డ పొదుగుతో సుందరమైన ఒక కుర్చీ చూపించి "దయచేయండి" అన్నాడు, సంపాదక మహాశయుడు, సగం మూసిన కళ్ళతో, సాముద్రికం నెమరువేస్తూ.

ఆ లావణ్యవతి, ముఖలక్షణాల్లో సౌందర్యాన్ని ప్రతిబింబించుతూ ఆసీన అయింది. అంతలోనే,

"మీ పరిచయ భాగ్యం కలిగించుకో వచ్చా" అన్నాడు, ఆధునిక సాహిత్య సేవకుల ఫక్కీలో, చిన్న పెదవుల మీద చిరునవ్వుతో, సరళమైన కంఠధ్వనిలో సంగీతపు సంగతులతో, అగాధ భావ గర్భితమై, అదోక విధమైన తలవూపుతో.

"నాపేరు వాసంతిక. నేను మీకు నాలుగు రోజుల క్రింద, ఒక ఆర్టికిల్ పోస్టు చేశాను. దాన్ని గురించి మాట్లాడడానికి వచ్చాను"అంది.

ఆ కనీని కదలికలు, ఆ యెర్రని పెదవుల బిగింపులు, ఆకొనదేరిన రోమ్ముల కదల్పులు, ఆ వ్యాస గుణాల్ని చదవకముందే అభివర్ణించి నయి.

"ఉహూ ! చదివిన జ్ఞప్తి. మీ పేరు మీ తండ్రిగారి సాహిత్య పరిజ్ఞానాన్ని సూచిస్తోంది. మిమ్మల్ని కలుసుకున్నందుకు చాలా సంతోషం. వెళ్లిపోవటానికి లేచాను కూడా"

"క్షమించాలి. యిప్పుడు కాని, తీరుబడికాదు, మాకు ప్రొద్దస్తమానం కాలేజీ చూడండీ!"

"మీరు విద్యార్థినులన్నమాట. ఏం చదువుతున్నారు—క్షమించాలి, మీవిషయాలు అడుగుతున్నందుకు."

"నో, నో, క్షమించటమెందుకూ ? సెకండ్ యియర్ చదువుతున్నాను."

"ఉహూ! ఆ వ్యాసంలో ప్రతిభ సెకండ్ యియర్ స్టూడెంట్సుకుమిం చింది. మీ వ్యాసం స్వీకరించినట్లు మీకు జాబురాలా ?"

"థ్యాంక్సు. నాకింకా అందలేదు"

"అయితే యింకా పోస్టుచేసి వుండరు."

ఇంతలో ఆడవాళ్లువచ్చినప్పుడు ఆచారం ప్రకారం, ఆఫీసుకుర్రాడు కాఫీ బిస్కట్లు తెచ్చాడు.

"అయ్యో! యింతకుముందే మా హాస్టల్లో టిఫిన్ తీసుకొస్తున్నానండీ!"

"కాఫీకేమిటండీ! కళ్ళుమూసుకు తాగేయవచ్చును. కాఫీ నిరాకరణం. సాహిత్య నిరాకరణం"

కాఫీ త్రాగుతున్నంతసేపూ, పద్మనాభశర్మకళ్లు, కాఫీ కప్పు అంచు మీదనుంచి వాసంతిక సౌందర్యాన్ని త్రాగుతూనే వున్నయి. కాఫీ చల్లారటానికి ఊదేటప్పుడు వికసిస్తూఉన్న మొగ్గలాంటి ఆ చిన్న నోరు చూస్తే కొరుక్కుతినాలనిపించింది అతనికి. ఆకుపచ్చ రంగు ముఖమల్ బాడీస్ అంచులవెనక మెరిసిపోయే మెడవంపులు చూస్తే ముద్దుపెట్టుకోవాలనిపించింది. ప్రయత్నఫలితమైన ఆవత్తు సంచలనంచూస్తే ఏదో ఏదో చేయాలనిపించింది.

సహజ సౌందర్యం అట్టే లేకపోయినా, యౌవనమూ, కళాశాలా సంపర్కమూ వాసంతికను దివ్య సుందరిని చేసినయి. ఆ సౌందర్య సందర్శనానంతరం అతనిలో కొట్లాడే భావాల్లో ఒకటీ అతని మొగంలో కనబడటంలేదు. స్త్రీ తత్వశాస్త్రంలో సిద్ధాంతి అయిన పద్మనాభశర్మ వాసంతిక లోంగదీస్తే లొంగే మనిషి అని గ్రహించాడు. అంతగావస్తే బ్రహ్మచర్యాస్త్రం ప్రయోగించవచ్చు. బ్రహ్మచర్యం స్వాధీనంలో వుంటే పెళ్లిగాని పిల్లల్నందర్నీ ఒకముట్టడివేసి వదలవచ్చు, ఫలితం యేమయినా, అతని హృదయ శీతలత్వం అందులో ఆ మానవత్వాన్ని గ్రహించనీయదు.

కాఫీ త్రాగేక సంభాషణ కాసేపు సాహిత్యంమీద జరిగింది.

"నా వింకా యెన్నో వ్యాసాలున్నాయండీ! అవన్నీ మీరు చూడాలి" అన్నది వాసంతిక.

"తప్పకుండా! మీకు అభ్యంతరం లేకపోతే నా ఆతిథ్యం తీసుకుని సావకాశంగా చర్చించుకోవచ్చు."

వాసంతిక కాస్త సంకోచించింది. కాని, సౌజన్యత చూస్తే సందేహాలు భయాలు పటాపంచలయిపోయినయి. ఆవిడ అతని "అడ్రసు" అడిగితీసుకుంది. వచ్చే ఆదివారం 3 గంటలకు కలుసుకుండే ఏర్పాటుజరిగింది

ఆదివారం వచ్చేలోగా పద్మనాభ శర్మ పల్లెటూళ్ళో వేసంగిశలవుల్లాగా గడవని కాలంతో బాధపడ్డాడు. ఆదివారంనాడు, కళాభిరతి వున్న కాలేజీ పిల్ల, ఎల్లాఉంచితే మెచ్చుకోలులో మేను మరుస్తుందో; అల్లాఉంచాడు గదిని.

మూడుంబావుకు ఠీవిగా రిక్షాలో నుంచి క్రిందికిదిగింది వాసంతిక. అవయవ సౌందర్యానికీ, అలంకార సరణికీ అంత చక్కని సామరశ్యం ఎక్కడో గాని, కుదరదు. ఆవిడ వంటిమీద చిన్నం బంగారం లేదు ఆవిడ అలంకార సామగ్రి అంతా వేలం వేస్తే పాతికరూపాయిలు చేయవు. ఖర్చులేని వేషంతో, భావజ్ఞుల్ని బందీలను చేసుకుండేశక్తి కాలేజీ పిల్లలకి పెట్టని సొమ్ము.

సర్కస్ పిల్ల నిచ్చెన యెక్కినట్లుగా రివ రివ మెట్లెక్కి వచ్చే వాసంతికకు ఎదురువెళ్లి ఒకనమస్కార బాణం వదిలేడు శర్మ. ప్రతి నమస్కరించి చరల్‌మని రిస్టువాచివంకచూచి వాసంతిక,

"క్షమించాలండీ! పావుగంట ఆలశ్యం చేశాను" అన్నది.

"ఫరవాలేదు. రిక్షా వాళ్ళ మీద ఆధారపడితే, ఆ మాత్రం వెనకా ముందుకు జరక్కమానవు. కూర్చోండి. ఇది మీ గదేననుకుని "యీజీగా పిలవండి""

వాసంతిక కూర్చుంది. సంభాషణారంభానికి ఎదురుచూస్తూ ప్రక్కగదిలో వున్న పద్మనాభ శర్మ స్నేహితులు "మన వాడికి కొత్త పీడ్లు దొరికింద"ని గుసగుసలాడుకున్నారు.

పరిచయం ఏకసందర్శన మాత్రమే అయినా, అంత ధైర్యంగా తన ఆహ్వానం స్వీకరించినందుకు, వాసంతికకు నెత్తురు ఉడికే భాషలో ధన్యవాదాలు అందించాడు పద్మనాభ శర్మ కాస్సేపు కళాశాలలో జీవితం మీద, ఆధునిక సారస్వతం మీదా, ఆడవాళ్ళ స్వాతంత్ర్యంమీదా సంభాషణ దొర్లింది. మాట్లాడేప్పుడు వాసంతిక విసిరిన చూపులూ, నవ్విన నవ్వులు, చేసిన అంగసంచలనాలూ సాధారణ యువతికి సహజములైనవి కావు.

"తలుచుకుంటే మీ రో గ్రేటా గార్బో అంతవారు కాదగినవారు" అన్నాడు శర్మ!

"అవునండీ! అందరూ నన్ను యాక్ట్రెస్ అంటారు. నాక్కూడా రంగ భూమిలోదిగి, ఆంధ్ర నాటక

కళకు కొత్తరూపం కొత్తజీవం తేవాలనే కోరిక, ఆనరుస్న అయిపోంగానే అదే కర్తవ్యం నాకు."

"ఆంధ్రదేశంలో మీలాంటి వీర కన్యక లుండబట్టే, కళలింకా జీవించి వున్నవి. త్వరలోనే మీ చిత్రమూ చరిత్రమూ భావవీధిలో ప్రచురించే అదృష్టం పట్టాలిమాకు. కాని నాట్య కళ అంటే మనవాళ్ళకి చాలా హేయమయిన అభిప్రాయాలున్నయి. మీ తల్లిదండ్రులు మిమ్మల్నీ వృత్తిలో దిగనిస్తారా?"

"మా నాన్నగారు చిన్నప్పుడే పోయినారు. మా అన్నయ్య అప్పుడే కళాసేవ మొదలెట్టేడు నా ఆదర్శాలకి అడ్డొచ్చేవా రెవరూలేరు"

"మీ యీప్సితమూ, ధైర్యమూ ప్రశంశనీయమైనవే గానీండి. నేటి నటీనటకుల నీతి ప్రవృత్తిమారేవరకు మనవంటివాళ్ళు జాగ్రత్తగా వుండాలి"

"మీరు ఆమాట అంటం నాకు చాలా ఆశ్చర్యంగా ఉందండీ! నీతికీ కళకూ యీ బలవద్వివాహమేమిటండీ? కళాసేవకూ నీతికీ యీ విరోధం చచ్చేదాకా ఉండేదే. కళకు ఫలితం ఆనందం. ఆనందకలిగించే దాన్నల్లా నీతి బహిష్కరించింది. స్త్రీ వ్యక్తిత్వం బయటబడాలంటే పురుషుడితో బంధాలన్నీ తెంపుకోవాలి. కళా మతంకోసం, స్వతంత్రంకోసం జీవితాల్నీ సుఖాల్నీ విసర్జించినవార్ని మనమందరం గౌరవించటంలా? ఒక మహాకళను పునరుద్ధరించి జాతి నాగరికతను ప్రపంచ నాగరికత స్థితికి తీసుక వచ్చే ప్రయత్నంలో, నాట్య కళా పునరుజ్జీవనంలో కొంతమంది నీతి పోతేమటుకేం? అసలీ నీతన్నమాటకు అర్థం లేదు. ఈ నియమాలను మన మెదడు పనిచేసి నిర్మించింది. వీటిని అనుసరించటానికి తర్ఫీయతుపొంది పొందించింది. ఇప్పుడు మన కొత్త మెదళ్లు, కొత్త నీతిధర్మాలను నిర్మించి వాటిని అవలంబించటానికి ఎందుకు తర్ఫీతు పొందగూడదు? ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క కాలంలో ఒక్కొక్క జాతి నీతి చరిత్ర పరిశీలించితే అది ఎన్నోవంపులూ వంగిందనీ, ఎన్నో మార్పులు చెందిందనీ ప్రత్యక్షంగా తెలుస్తుంది. మన కళకోసం మన నీతిని మనమెందుకు మార్చుకోగూడదు? స్త్రీలు నాటకాల్లోదిగితే, ఒక్కొక్కస్త్రీ అనేక నాటకాల్లో అనేకమంది నాయకులప్రక్క నాయకీ పాత్ర ధరించుతుంది. అప్పుడు పరస్పర ప్రశంశ తీవ్రమైతే అది తాత్కాలిక ప్రేమగా పరిణమించి ఆస్త్రీ అనేక మందితో జాత్య సంపర్కం కలిగించుకుంటుంది. ఇల్లాగే పురుషులూనూ? ఇదీ ప్రతిపక్షవాదం. ఇది నిజమే! కాదంటం సత్యానికి ద్రోహం; ప్రత్యక్షమయిన మోసం. ఇందులో తప్పేమీ కనబడదు నాకు. నాటకాల్లో దిగనివారూ నీతి శృంఖలాలు తగిలించుకున్నవారూ యీ సంబంధాలు లేకుండా వున్నారా? వారందరి మాటా ఏమిటి? ఈ దౌర్జన్యం సహించటానికే వీలులేనివి..."

"ఆకళ్లలో తీక్ష్ణతా, ఆమాటల్లో పటుత్వం, ఆభావాల్లో వేడి చూస్తే పద్మనాభశర్మకు భయం పుట్టింది. సాధనానికి చక్కని క్షేత్రం అనుకున్నాడు. అదివరదాకా ఆవిడ యావనాన్ని వెంగిలిచెయ్యటంలో ఏదో శ్రమ పడాలనుకున్నాడు, ఆవిడ ఉపన్యాసం విన్నాక, అందాకా వచ్చిన పిల్ల ఆట్టే పేచీలు పెట్టదనిపించింది. ఆరకం మనుషులు "జౌన"ంటేసరి; దాసులయ్యూరకుంటారు.

"మీరుచెప్పింది నిజమేనండీ! కాని యీరకం ఉద్రేకాల్ని మీవంటివ్యక్తుల్నీ గౌరవించి ఆహ్వానించే సంఘం యింకా సృష్టింప బడలం. ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటే ఇల్లాంటి ఉద్రేకాలెన్నిఉన్నా ప్రమాదంఉండదు. ధనదేవత కంటి మెరుపుకు ధర్మాలు ధర్మజ్ఞులుకూడా తహతహలాడ్తారు."

"అదేనండీ నాతోనూ చిక్కు. కాల్లెక్కి తిరిగేవారేపనిచేసినా ఎవరూ ఏమీఅనరు. ఎవరిమీదో ఆధారపడే నాలాంటివాళ్లమీద ప్రతివారూ దాడివెళ్లేవారే! అందుకనే నాఉద్రేకాల్నీ ఆశయాల్నీ గౌరవించి నాకు రక్షణ యిచ్చే మహాశయులకి నాతను ప్రాణాలు అర్పించు తాను."

"నా frank nessకు క్షమించండి. ఆ రక్షణ నేను మీకిస్తా ననుకోండీ. అప్పుడు ...?"

ఆటుపోటులతో అమావశ్యనాడు సముద్రంలాగా వాసంతికలో యావనం ఘూర్ణిల్లుతోంది. ముందున్నవాడు, అసాధారణ సౌందర్య మూర్తి. ఆవిడ నెత్తురులో చిమచిమ. "సరేననమంది." ఆవిడలో అజ్ఞాత వాసం చేసే లోక భీతి, పేచీ పెట్టింది.

నిశ్శబ్దంగా కొన్నిక్షణాలు గడిపి "మీకు పెళ్ళిగాలేదుగా?" అన్నది. నక్షత్రాల వంటి తన కళ్ళని వాసంతిక మొగంమీద నిలిపి, పద్మనాభ శర్మ,

శిరఃకంపనంతో సందేహ నివృత్తి చేశాడు. అల్లాంటి ఘట్టాలు అతను యిరవయ్యో ముప్ఫయ్యో చూశాడు అప్పటికి.

దించిన తలయెత్తలేదు వాసంతిక. పసిడికాడల్లాంటి తన తరుణాంగుళులతో బల్లమీద సరిగమలు వాయిం చుతూ, ఉద్రేకంతో రక్తనాళాల్లో ఉబికిపోయే ఉష్ణరక్తంతో దెబ్బలాడుతూ, బలవంతంగా చెక్కిళ్ళల్లోకి పొడుచుకువచ్చే యాపుల్ పళ్ళని అణచుకుంటూ, కూర్చుంది. కాంతిలో కదులాడే సీమకత్తిలాగా, ఆవిడ ఆ పాదమస్తకం తళతళలాడి పోయింది.

ఆవిడ శరీరంలో ప్రతి జీవణువూ, అతని కౌగిలింతకు ఆకలిగొన్నది. అతనే తన వాడవుతున్నాడు. ఇంకేంగావాలి ?

పద్మనాభశర్మ లేచాడు. కలుసం విడిచిన గోధుమవన్నె తాచులాగా నవనవలాడే తన బాహువుల్ని ఆవిడ బుజాలమీదవేసి ఎదురుగా నుంచున్నాడు. ఒక క్షణశకలకాలం, వాసంతిక తలయెత్తి అతని కళ్ళల్లోకి చూసింది. ఆవిడ చెక్కిళ్లు అతని వక్షంమీద విశ్రాంతి పుచ్చుకున్నయి.

ఆత్మనశించిన అతనికామం వేసవి తుపానులో పెనుగాలి కెరటంలాగా ఒక్కమాటు పైకివచ్చింది. దృఢమైన తన బాహుబంధాన్ని వాసంతికి వక్షం చుట్టూ పెనవేసి బిగించి ఒక చేత్తో ఆవిడ రెండు చెక్కిళ్లనీ నొక్కిపట్టి సెర్చిలైట్లవంటి ఆకళ్లు, దోషపంకిలములయిన తనకళ్ళని మిరుమిట్లుగొలుపుతూవుంటే కళ్లు మూసుకుని ఆనన్యచుంబితమయిన ఆ అధరలేఖ మీద కామదేవత పోస్టాఫీసులో మొదటిముద్ర వేశాడు. గులాబీరేకుల వంటి ఆపెదవులూ పింగాణీ ముక్కల వంటి ఆచెక్కుల్లూ, అరటి వూచవంటి ఆమెడా, గాలిపోసిన జపాను బెల్లూన్లాంటి ఆరొమ్ముల్నీ అన్నీ ఆ రాక్షస దాహ సంతృప్తిలో నలిగి కందిపోయినయి. ఆవిధంగా జీవరసం పిండుకు తాగే మొగవాడుంటే ఆడదానికి యింకా యేంగావాలి ? వివశత్వంలో వాసంతిక బాహిరాన్ని మరచింది.

అంతటితో ఊరుకోలేదు, పద్మనాభశర్మ. ఏపనిచేస్తే ఆవిడ పవిత్ర యౌవనం యెంగిలిఅయి గౌరవదూరమౌతుందో ఆపనికి ఉద్యమించాడతను.

అప్పటికి ఆవిడకు నెత్తి అంటింది. అతని ఆకర్షణతో తాకెక్క తనేం జేస్తున్నదీ ఆవిడకు స్పృహకువచ్చింది. తన బలం అంతా వినియోగించి,అతన్ని అవతలకు నెట్టుతూ "వద్దు. అపని వద్దు. ఉహు నామాట వినండి! అబ్బ ఒద్దు ఉఁహు" అంటూ గొణిగింది.

మహాత్ములు ప్రారంభించిన ఉద్యమాన్ని మధ్యలో విడవరు. అతడూ తన దురుద్యమాన్ని విడవలేదు. "ఏం ప్రమాదముందీ! యింతలో? ఎల్లాగూ నేను నీవాణ్ణేగా? ఇంకేభయం ? యింతేనా నీప్రేమ?"అన్నాడు అపట్టువిడవకుండానే ఆమెకుంతలాల్ని నిమురుతూ. మాటమాటకు అతని కౌగిలింత బిగువైంది. క్షణక్షణము ఆవిడ కెంపశేచరుపెకెక్కింది. ఆవిడలో నిద్రించుతూవుండే జాత్యం (sex) అనిర్వచనీయమూ, అపూర్వమూ అయిన యేదోసుఖమూ ఆవిడబుద్ధినిక్రమ్మివేసినయి. పాతచెప్పులో పాదంలాగా వాసంతిక పద్మనాభశర్మ కౌగలిలో యిమిడిపోయింది.

* * *

కైనమైటుకునిప్పంటించి పేలొద్దంటే ఊరుకుంటుందా ?

ఒక అమూల్య కుసుమాన్ని నాశనం చేస్తున్నాననీ, ఒకఅమృత భాండంలో విషం పోస్తున్నాననీ నలుసంతయినా, ఆ శీతలహృదయుడు తలచలేదు. ఆ అనుచిత కార్యంతో, వాసంతిక అనే ఆకాశగంగ కూంబీనది అయిపోయింది. అనేక వ్యభిచారిణీ సంగమంతో విష శరీరం అయిన అతని కలయికతో, ఆవిడ స్ఫాటిక నైర్మల్యం విష క్రిమివంతమైంది.

ఆ వైపు వదిలేక, ఆ అలసట తీరేక, "ఎంతపని చేశారు ?" అన్నది నిందా పూర్వకంగా వాసంతిక.

"ఏంతప్పింది. కళాసేవకికి యీ మాత్రం తెగువలేకపోతే యెల్లా ? అన్నాడు. శర్మ.

"పోనీండి నాకు యేచిక్కులూ రాకుండా చూడండి" అన్నది. ఆ కంఠంలో పూర్వం వుండే దర్పంలేదు. ఆ మాటల్లో పూర్వం ఉండే ఠీవిలేదు.

"నేను మానవుణ్ణనే విశ్వాసం లేదూ నీకు ?" అన్నాడు శర్మ.

"క్షమించండి. నా ఆదుర్దాలోనే నున్నాను మీలో విశ్వాసం లేక కాదు." ఈ కొత్తమర్యాద కొంపలు తీస్తోంది !

అప్పటికి అయిదుదాటింది. వాసంతిక వెళ్తానంది.

"మళ్ళీ యెప్పుడు మహారాణీ దర్శనం ?" అన్నాడుశర్మ. ఆడవాళ్ళకి తైరుకొట్టడంలో అతనికి యెవరూ సాటిరారు.

"మహారాజు తల్చుకున్నప్పుడు ! వచ్చే శనివారం," అన్నది వాసంతిక అతన్ని క్రీగంట చూస్తూ.

మళ్ళీ ఒక మాటు గట్టిగా కావిలించుకుని; ముద్దెట్టుకుని, మెత్తని ఆ బుగ్గలమీద చిన్న లెంపకాయ కొట్టి, క్రిందకు తీసుకువెళ్ళి రిక్షాలో ఎక్కించాడు. రిక్షా కదిలేటప్పుడు వాసంతిక కదిలీ కదలని కనీకికలు "వెళ్తానూ" అన్నయి. రిక్షా సాగిపోయింది.

"రాస్కెల్ ! దీన్ని పెళ్ళిచేసుకోవాలిట ! నావంటివాళ్లెంతమంది అయినారో ?" అనుకున్నాడు తనలో శర్మ సాగిపోయే రిక్షా వంక చూస్తూ.

ఆ మరుసటి వారం అంతా వాసంతికకు పాఠాలు అర్థం కాలేదు. క్లాసుల్లో పాఠాలు వినకుండా, తన కవిత్వం అంతా వర్షించుతూ ప్రణయ లేఖలు వ్రాసేది. వాటన్నింటికీ శర్మ ఫోన్ మీద జవాబు పంపేవాడు. కాని కాగితంమీద ఒకమాటయిన పెట్టేవాడుకాదు. "జవాబురాయరేం" అనిఅడిగింది. "నాతోటివాళ్ల చేతుల్లో పడితే బాగుండదు." అని జవాబు చెప్పేడు.

ఇహం పరం నువ్వేనని పాదాక్రాంతులయ్యే అమాయకుల్ని కాలతంతారు, ఆడవాళ్ళు. ఇల్లాంటి పయోముఖ విషకుంభాలకు మాన ప్రాణాలప్పగించుతున్నారు. ఈ సైకాలజీ యెంతకూ అర్థంగాదు.

అల్లా అయిదారు వారాలు గడిచినయి. వాసంతిక శరీరద్యుతి అంతా పోయింది. విపరీత రక్తస్రావం ఆరంభమయింది. మొగమ్మీద యేవో మచ్చలు పుట్టినయి. తోటి పిల్లలు గుసగుసలారంభించారు.

ఆ జబ్బుతో ఆ విడకు పురుష వాంఛాదాహం విపరీతం అయింది. ఒకప్పుడు పవిత్ర జలపరిపూర్ణమైన నిర్మల స్రవంతి, వాసంతిక. ఇప్పుడు క్రిమికీటక సంకీర్ణమైన మురికిగుంట.

తనస్థితి చూసుకుంటే వాసంతికకు గుండెలు పగిలిపోయేవి. వివాహం మాట కదిలించితే అతను "ఔను. కాదు" అనకుండా జవాబులు చెప్పేవాడు. ఒకనాడు ఏసంగతీ తేల్చుకుందామని అతనికి గదికి వెళ్ళింది.

శర్మ యింట్లో లేడు. అతని స్థానే అతని మిత్రశేఖరుడు దామోదరం ఉన్నాడు. వాసంతిక అతన్ని చూసి వెనక్కుతగ్గి "శర్మ గారు లేరండీ" అన్నది. "వస్తాడు కూర్చోండి" అన్నాడతను. వాసంతిక కూర్చుంది. దామోదరం వెంటనే తలుపుమూసి గడియ బిగించి ఆవిడ బుజంమీద చేయి వేశాడు. చివాలున లేచి నుంచుని వాసంతిక "ఏమిటి మీ వుద్దేశ్యం ?" అన్నది. అతనొక విషపునవ్వు నవ్వి, జేబులోనుంచి ఒక ఉత్తరాలకట్ట తీసి చూపించి "కిక్కురుమనకు. చూశావా ? ఏమయినా అడ్డంకిచెబితే మీ మేట్రన్‌కు చూపించి నీకుంపతెంచుతాను."

వాసంతికకు గుండెలు ఆగినట్లయింది. తన ప్రేమనిధాన మనుకున్న శర్మ తన కొంప తీశాడు. ప్రేమోద్రేకంలో రాయగూడనివన్నీ రాసింది. తానా ఉత్తరాల్లో ! "మీకో నమస్కారం ! నన్ను వదలండి. ఇక యెప్పుడూ యిక్కడికిరాను. నన్ను క్షమించండి. రక్షించండి" అని వేడుకుంది. ఆ కళ్ళల్లో దైన్యానికి నల్లరాళ్లు కరగాలి. కాని, అతను చలించలేదు. బలాత్కారం సాగించాడు. అరిచి అల్లరిచేద్దామనుకుంది వాసంతిక. కాని, యేం లాభం ? అల్లరి తప్ప ? అరిటెఆకు ముల్లుమీదపడ్డా ఆకే చినుగుతుంది. ముల్లు ఆకుమీదపడ్డా ఆకే చినుగుతుంది. ఆవిడకు గుబులు గుబులుగా యేడుపువచ్చింది. దయావిహీనమైన లోకంనోట్లో పడేకంటే, అతనికి శరీరం అప్పగించితేనే మంచిదనుకుంది. తన దాహం తీరేదాకా ఆవిడ యౌవనాన్ని త్రాగి దామోదరం అవతలకెళ్ళేడు. వాడి స్థానే మరోడు తయారయినాడు. మళ్ళీఅదే బెదిరింపు. అదే నాటకం వాడి కాళ్ళమీదపడి యేడ్చింది వాసంతిక. కాని, యేడిస్తే కదిలే గుండెలుకావు వాళ్లవి. వాడూ ఆవిడను బలవంతంగా వినియోగించుకుని తన రాక్షస దాహం తీర్చుకున్నాడు.

అతి దుఃఖంతో ఆవిడ మతి భ్రష్టమైంది. పాడయిపోయిన శీలం యెల్లాగూ పాడయింది. దీన్ని యింకా యెంతమంది వినియోగించుకుంటే నేం? తనఅపవిత్ర యౌవనానుభూతితో వారిని యింకా అపవిత్రుల్ని

కానీ, ఆ తర్వాత ఆవిడ యేమి ఆభ్యంతరం పెట్టలేదు.

ఆ దుర్మార్గులకు కావలసింది ఆవిడ ప్రేమకాదు. హృదయాన్ని కోరేది హృదయం. అది వారిలో శూన్యం. వాళ్ళకు కావలసింది ఆవిడ అవయవాలు. అన్నిటికన్నా దుఃఖకరమైన విషయం అందులో డిగ్రీలేనివాడు ఒకడూ లేడు. వాసంతిక యిప్డొక పెద్ద మురుగు కాలవ.

బరువైన హృదయంతో బాధించే అవయవాలతో యింటికి వెళ్లింది వాసంతిక. ఆవిడకు జీవితంమీద విరక్తి కలిగింది. బ్రతికివుంటే ఆహాంతకులకు లొంగాలి. లొంగకపోతే అల్లరి అవమానం ఆ రాత్రిఅంతా దుఃఖించింది. ఆమర్నాడు ఆవిడ యెవరికి కనబడలేదు. ఏ అగాధ సముద్రగర్భం ఆవిడని తనలో కలుపుకుందో?

ఆ విషాదవార్త పద్మనాభశర్మ వార్తాపత్రికల్లో చూశాడు. ఒక కిరాతక శిరఃకంపనంచేసి "పీడా నివృత్తి" అనుకున్నాడు. మనం ఎక్కడికి పోతున్నాము? ముందుకా? వెనక్కా?"

(అన్ని హక్కులూ వ్యాసకర్తవి)


# ఆనంద ఆంగ్ల భాషాబోధిని

728 పేజీలు

16 నిండు పేజీ చిత్రములు

తెనుగు తెలిసిన మీరు స్వయముగ మూడు మాసములలో ఆంగ్లమును వ్రాయను, చదువను, మాటాడను నేర్చుకొనగలరు.

వ్రాత, ఉచ్చారణ అన్నీ స్వయముగ మీకు సావకాశము గల సమయములందు దినమున కొక గంటవంతున చదువుచు నేర్చుకొన గలరు. ఈ దినములందు ఆంగ్లపరిచయ మవసరము. అవకాశమున్న సమయమున యిటులుండరాదు. ఒక మహాభాష నింత సులభముగ మీకు తెలుపగల 728 పేజీల గ్రంథమేది? ఆనంద ఆంగ్లభాషాబోధిని.

నేడే యీ గ్రంథమును తెప్పించి ప్రారంభించి భాషా పరిచయము కలిగించుకొనుడు.

గ్రంథము వెల 2 రూపాయలు.

పోస్టేజి 9 అణాలు.

ఆనందబోధిని ఆఫీసు,

సౌకారుపేట,

మదరాసు.